
# అపోహ

"కృష్ణ"



ఆ రోజు కాస్త ఆలస్యంగా బడికి వెళ్ళాను వెళ్ళి కూర్చున్న పది నిమిషాలకంతా స్కూలు ప్యూను "మీకు టపాలో ఈ పుస్తక వచ్చిం"దని తెచ్చి యిచ్చాడు పత్రిక నాకెందు కొచ్చిందా అని, ఆశ్చర్యపడ్డాను విలాసం చూచాను. అసలు నాదా కాదాని? నాదే. సందేహం తీరిపోయింది ఈమధ్య కథలు వ్రాయడం అలవాటు చేసుకుంటున్నాను స్కూలు పత్రికల్లోతప్ప బైట పత్రికలకు పంపించడం మొదలెట్టలేదు. పుస్తకం తెరిచి వరసాగ్గా కథలన్నీ చూస్తూ పేజీలు త్రిప్పుతున్నాను. ఒకచోట ఆగి చూచాను. "కథ చేసిన గడబిడ" రచన "ఆచార్య" అని ఉంది అతను కథలు వ్రాస్తాడని తెలుసు కాని అతనిది కాదేమో! ఎందరు లేరు వ్రాసేవాళ్లు! పుస్తకం ఆఖరు పేజీవరకూ చూచాను. నా పేరుమాత్రం కనిపించలేదు అంతలో రాధ నా చేతిలో పుస్తకం తీసుకొని చూసింది అసలు నాకెవరు పంపారు? ఎందుకు పంపారు? అతనికీ నాకూ ఉత్తరాల పరిచయం ఉంది అతని వాలకానికి, అతని ఆకారానికి అతని మనస్సుకూ తేడాలున్నాయి అతన్ని చూస్తుంటే, ఏదో జేబులు కొట్టేవాడున్నట్టుంటాడు. చాలా తెలివికలవాడని అతనితో పరిచయమున్న వాళ్లంటుంటారు. అతను నాకు చాలా ఉత్తరాలు వ్రాశాడు నేను ఒక్క ఉత్తరమే వ్రాశాను "నాకు ఉత్తరాలు రాయడం మానుకో. ఇది మంచిపని కాదు" అని, అతనే ఈ కథ వ్రాసి తన గొప్పతనం నాముందు ప్రదర్శించుకోవాలనుకున్నాడు కాబోలు! నాలో నేను మురిసిపడ్డాను ఈలోగా గంటకొట్టారు. బైటికివచ్చి ప్రక్కనున్న మఱ్ఱిచెట్టుక్రింద కూర్చొని అతని కథ చదవకూడదనుకుంటూనే చదవడం మొదలెట్టాను అంతా నాకథే వ్రాశాడు. నేను వ్రాసిన ఉత్తరం, అతను వ్రాసినవాటిల్లో మంచి వో నాలుగు ఉత్తరాలు చేర్చి, ఆఖరుకు అతనితో పెండ్లి జరిగినట్టు కథ పూర్తి చేశాడు. నాకు ఒళ్లు మండింది

అతను నాదగ్గరున్న పుస్తకాలు— అంటే, నేను వార్షికోత్సవసందర్భంలో పాడిన పాటలకు బహుమతిగా వచ్చినవి చదివిస్తానని చాలామందిచేత అడిగించాడు ఇవ్వనని చెప్పినా మళ్ళీ మళ్ళీ అడిగించి ఆఖరుకు రాధ మొగుడితో చెప్పి రాధచేత తెప్పించుకుని చదివాడు. చదివి నాకు పంపుతూ — అందులో అభినందనలు ఆశీస్సులు అందించాడు. నేను మామూలుగానే ఊరుకున్నాను నాలుగోరోజున ఒక ఉత్తరం వ్రాశాడు. ఒక చిన్న భారతమంత ఉందది

అమ్మాయీ!, ఈ ప్రపంచంలో మొగవాళ్ళ నేమనాలో నాకర్థం కావడంలేదు. ఏమంటే ఎవ్వరైనా ఆడపిల్ల నవ్వుతూ ఒకటికి రెండుసార్లు చూచిందీ అంటే, ఇండియా ప్రధాన మంత్రిపదవిలో పడ్డంత సంతోషపడతాడు ఆ చిరునవ్వుతో నే ఏమైనా అడిగిందీ అంటే, ఇంక సప్తసముద్రాలూ ఈది, పారిజాతపుష్పాన్నైనా తెచ్చిపెట్టి మెప్పుపొందుతాడు. పొందాలని ఉబలాటమో, ప్రాకులాటో! ప్రాధేయపడడమో జరుగుతుంది కానీ! ఆడపిల్ల అలా కాదు. మగవాణ్ణి గడ్డిపరకక్రింద కట్టి పారేస్తారు మళ్ళీ వాలుచూపుతోనే కత్తిరించేస్తుంటారు ఇది ఎందులో ఉన్నదా అని నాలో నేను చాలాసార్లు ప్రశ్నించుకున్నాను. కానీ సమాధానం దొరకలేదు. [illegible]ప్రశ్న అలా గుండెల్లోనే ఉండిపోయింది. [illegible]సులో ఏదో అందని సైకలాజికల్ [illegible]ంటొకటి నిగూఢంగా గాఢంగా ఉండిఉండాలి. అంతేగా మరి? ఇప్పుడు పుస్తకం నిన్నడిగాననుకో! దాని కెన్ని రికమండేషన్సు? ఎంత హంగామా! నీవు ఇవ్వననీ, నేను చదవాలనీ తాపత్రయపడడం జరిగింది కదూ? అదే నీవు నన్నడిగి ఉన్నట్లైతే, నేను దక్షిణాఫ్రికాలో ఉన్నా ఉత్తరధృవాని కెగ్రాకవలసినా భూనభోంతరాళాలలో, ఈరేడు లోకాలలో గాలించి ఎక్కడున్నా వెతికి, వస్తువున్నా సరే తెచ్చి ఇస్తాను అనేవాణ్ణి; అంటాను అనవా? అంటాను కదూ? ఆలోచించు. ఇది మగవాడిలో ఉన్న బలహీనతో లేక, అబల అనే వంకతో ఆడవాళ్లుచేసే ఇంద్రజాలమో? నాకు తెలియడంలేదు నేను నీకు పుస్తకాలు తిరిగి ఇస్తూ నీ దగ్గరున్న పద్యాల పుస్తకాలు ఇవ్వమన్నాను లేకపోతే నీ దగ్గర లేనట్టు తెలియపరచమన్నాను. నా మాటలు తృణప్రాయంగా

ఏంచావు. అయినప్పటికీ సిగ్గులేక, నేనే మళ్ళీ ఈ జాబు వ్రాస్తున్నాను.

ఇదంతా నీదగ్గిర పరపతి సంపాదించడానికేసుమా! పుస్తకాలంటే పంపు. ఇవే మగవాళ్లదగ్గరున్నట్లయితే ఎంత తేలిగ్గా సంపాదించేవాళ్లో! సంఘం అనాదినుండీ స్త్రీనీ పురుషుణ్ణీ వేరువేరుగా ఉండేలా విధించింది. ఆకట్టుబాట్లకు కట్టుబడి పోవాలి. నిన్ను స్కూల్లో అడగడానికి వీలులేదు. పుస్తకాలన్నావు కదూ? మా యింట్లో, చాలా ఉన్నాయని విన్నాను. నీకు నేనేమీ సాయం చేయలేకపోయినా, నాకు నీవు సాయం చేయాలి! బహుశా నా సాయం నీకు అక్కర్లేదనుకుంటాను. కాని నాకు పుస్తకాలంటే ప్రాణం. కాని చదవలేను. నా బ్రతుకు నీకు తెలియనిదేముంది? 24 గంటల్లో 8 గంటలు పని, ఎనిమిది గంటలు నిద్ర, 8 గంటలు చదువు ఇదీ నా కార్యక్రమం. రెక్కాడితేకాని డొక్కాడదు నేను నీతో ఎగబడి మాటాడితే లోకం తూటాకులు కడుతుంది పైనా నాతో నీవు మాటాడాలన్న తలపు నాకు లేదు అసలు నీకు లేదని వ్రాయాల్సిన పనిలేదు. ఎందుకంటే మనిద్దరిమధ్య సంఘం నిర్మించిన కారునలుపు తెర ఒకటుంది. మన పేస్తం ఒప్పుకోగు లోకం దాన్ని పరేళ్ళకి తెంచుకోగలుగుతామేమో! అది ఇప్పుడు చేస్తే లోకం మనల్ని ఇరవైవిళ్ళ వెనక్కు నెడుతుంది. ఈలోకంలో ఇద్దరు మగాళ్ళు స్నేహంగా ఉంటే లోకం పట్టించుకోదు. ఇద్దరాడాళ్లు అలాఉన్నా లోకమంతే. ఆడా మగా స్నేహంగా ఉంటే ఊరుకోదు. వాళ్లుకూడా ఊరుకోరనుకో!

సెలవు—

—పుస్తకాలబ్బాయ్.

ఉత్తరం పూర్తిగా చదివాక నాకేమీ పాలుపోలేదు. ఊరుకున్నాను. ఇతను ఎందుకిదంతా వ్రాశాడు? ఇంత లోకువగా ఎందుకు వ్రాసుకున్నాడు? మళ్లీ రెండురోజులకింకో ఉత్తరం వ్రాశాడు. దాదాపు అంతే ఉంది. అందులో పాట కూడా వ్రాశాడు; ఇంక వరసగా వ్రాయసం సాగించాడు. మొట్టమొదట్లో మాట్లాడలేను మాట్లాడితేనే సరదా అని, ఆతరువాత మాట్లాడమని బ్రతిమాలుతూ ఇంకో ఉత్తరాలు వ్రాశాడు.

నేను ఒక జాబు వ్రాశాను. "ఏమీ తెలియని నావంటి బాలికను ఇలా నిర్బంధించడం తగదు. మీకిది న్యాయంకాదు మీ ఉత్తరాలవల్ల నేను చదువు మానుకోవలసి వస్తుంది" అని వ్రాశాను. మళ్ళీ ఉత్తరాల వర్షం కురిపించాడు. నాకు విసుగెత్తి ఉత్తరాలు చదవడంకూడా మానుకున్నాను. జవాబు ఇవ్వలేదు. అతనికూడా విసుగు పుట్టిందికాబోలు; ఊరుకున్నాడు. ఈవిషయమంతా రాధకు చెప్పాను. అతన్ని చూపించి - రాధ "అతను రౌడీ. చాలా దుర్మార్గుడు" అని అరగంట లెక్చరిచ్చింది. అది చెప్పినవన్నీ నిజం కాదని తరువాత తెలుసుకున్నాను. ఊరుకున్నాను. తరువాత అతను వ్రాసిన ఉత్తరాలన్నీ కలిపి కథ వ్రాసిపంపాడుకాబోలు ననుకున్నాను. కథ చదివి రాధకు చెప్పానిదంతా. అతనెక్కడన్నా కనిపిస్తాడేమో! అడుగుదామనుకున్నాను. ఆ సాయంత్రమే మా అన్నయ్య స్నేహితుడు గోపాల్ మాఇంటికొచ్చాడు. అతనితో ఈ విషయమంతా చెప్పాను. విని "ఈ కథ అతను వ్రాయలేదు" అన్నాడు.

"మరి అతని పేరుందికదా?" అన్నాను.

"ఉన్నా సరే. అతనుమాత్రం వ్రాయలేదు. అతను నా స్నేహితుడు. అతను వ్రాసిన ప్రతి కథా నాకు చూపుతాడు."

"నా ఉత్తరాల సంగతో?" అన్నాను.

"అన్నీ నాకు తెలుసు. నీ జవాబుకూడా నాకు తెల్సు. ఆ రోజే మానుకున్నాడు అన్నీ."

"అతను నీ స్నేహితుడా?" అన్నాను.

"అవును" అన్నాడు.

"అతనితో చెలిమి మానుకో" అన్నాను.

"అతని విషయం నీకు తెలియదు. అతను చాలా మంచివాడు" అన్నాడు

"నీ స్నేహితుణ్ణి నువ్వు మెచ్చుకోవలసిందే" అన్నాను.

"పోనీలే!" అన్నాడు.

"అతనితో మాట్లాడితే, నీవు మా రావద్దు" అన్నాను

గోపాల్ వెళ్ళిపోయాడు. వారం తిరిగింది. రాధ కీ విషయం తెలిసింది. అది స్కూలంతా గోల చేసింది స్కూల్లో వాళ్ళంతా వేలుపెట్టి చూపి గుసగుసలాడుకోవడం చాలాసార్లు చూశాను. శనివారం సాయంత్రం దేవాలయంలో కనిపించాడు. నావెంట ఒకమ్మాయి ఉంది. ఇద్దరం ప్రక్కన కూర్చొని సూటిపోటుగా నానా మాటలూ అన్నాము.

అతను అన్నీ విని, "నిజం నిలకడమీద తెలియాలి బ్రహ్మం" అని తత్వం పాడుకుంటూ వెళ్ళిపోయాడు. ఇంత సిగ్గులేని వాడేమా? అనుకున్నాను. స్కూల్లో అంతా అల్లరిగా ఉంది.

ఈవిషయం మా టీచరు ఒకామెకు తెలిసింది. నన్ను వాళ్ళింటికి తీసుకువెళ్లింది. "అమ్మాయ్ ఏమిటా కథ చేసిన గడబిడ?" అంది.

"నాకేం తెలియదండీ" అన్నాను.

"ఆచార్య నీకు ఉత్తరాలు వ్రాశాడా?" అంది.

నేను పలకలేదు.

"ఆ కథ నేనే వ్రాశాను. నీకు వచ్చిన ప్రతి ఉత్తరం ఒకరోజాలస్యంగా వచ్చేది. నీవా విషయాన్ని గమనించలేదు. అన్నీ కాపీ తీసుకుని నీకు పంపాను. నీ విషయం ఆలోచిస్తానే, అతను కూడా మగనపడుతున్నాడు; అతను వ్రాయందే కథ వచ్చినందుకు; అతను వ్రాసిన ఉత్తరాలన్నీ కథలో ఉండటంవల్ల కథ నేనే వ్రాసి అతన్ని గోల చేశాననుకుంటున్నాడు. ఇంక జన్మలో అతను ఉత్తరాలు నీకు వ్రాయడు" అంది. నేనేమనాలో పాలుపోక, "రాత్రి అతన్ని గుళ్ళో తిట్టానండీ." అన్నాను.

"తిట్టావా?" అంది.

"అవును" అన్నాను.

"బలేపని చేశావు" అంది.

"అయితే అతని పేరెందుకు పెట్టారు?" అన్నాను.

"ఉత్తరాలన్నీ అతనివే? ఆ కథలో ఏముంది? అన్నీ ఉత్తరాలేగా! పోతే కథలో ఆఖర్ని పెండ్లి జరిగినట్టు కల్పించాను" అంది.

నేనేమీ మాట్లాడలేకపోయాను.

"అతను ఉత్తరాలు చాలా బాగా వ్రాశాడు. నిజంగా అలా ఉత్తరాలు వ్రాసేవాళ్ళుంటే ఎంత బాగుంటుంది?" అన్నదామె.

నేను వచ్చేశాను. వస్తుండగా అతనూ గోపాల్ బాటనే వెళుతూ నన్ను చూశారు. అతను గోపాల్‌తో "కథ చేసిన గడబిడ ఎలా ఉన్నా, గుళ్ళో చివాట్లు బాగా ఉన్నాయి గోపాల్" అన్నాడు.

వెళుతూ వెళుతూ "గోపాల్! నిన్ను అమ్మ రమ్మంది" అన్నాను. సాయంత్రం ఇంటికివచ్చాక అన్నీ గోపాల్‌తో చెప్పాను. గోపాల్ వాళ్తో మాట్లాడకుండా అమ్మతో మాట్లాడి వెళ్లిపోయాడు; మర్నాడు స్కూలుకు ఒక ఉత్తరం వచ్చింది. అందులో "తెలుసుకున్నందుకు చాలా సంతోషం" అని ఉంది.

★

హకల్ బెరిఫిన్
వెల 2-0-0
ఆంధ్ర గ్రంథమాల,
మద్రాసు-1